సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



మసిబారుతున్న బతుకులు

జీడి పరిశ్రమల్లో బతుకులు మసిబారుతున్నాయి. పట్టించుకునే వారు లేకపోయారు. - IIలో



గ్రామీణ బ్యాంకు సేవలకు బ్రేక్

గ్రామీణ బ్యాంకు సేవలకు బ్రేక్ పడింది. విలీన ప్రక్రియే దీనికి కారణం. - IIలో

జిల్లా సమీక్ష కమిటీ సమావేశం రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా సమీక్ష కమిటీ సమావేశం ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం వెల్లడించారు. జిల్లా సమీక్ష కమిటీ సమావేశం ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉంటుందన్నారు. ఈ సమావేశం రాష్ట్ర సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు.

న్యూస్‌రీల్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం

నరసన్నపేట: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాలను సేకరించడానికి ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పార్టీ శ్రేణులు ఏయే తేదీల్లో ఏయే కార్యక్రమాలు చేపట్టాలో వివరిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ గురువారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించా రు. అలాగే అక్టోబరు 10 నుంచి నవంబర్ 22 వరకూ రచ్చబండ, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. అక్టోబరు 28న అన్ని నియోజవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలన్నారు. నవంబర్ 12న జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ 23న సేకరించిన సంతకాల పత్రాలు నియోజకవర్గాల నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి చేర్చాలన్నారు. 24న ఈ సంతకాల పత్రాలు జిల్లా కేంద్రం నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిస్తామన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా మొత్తం కోటి సంతకాలతో పత్రాలు గవర్నర్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు సురక్షిత నీరు అందించాలి : కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పిల్లల ఆరోగ్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. హాస్టళ్లలో నీటి నాణ్యత పరీక్షించాలని సూచించారు. సమావేశం అనంతరం జీఎస్టీ తగ్గింపుతో ఇంటింటికి లబ్ధి అనే గోడ పత్రికలను, డీఆర్‌డీఏ రూపొందించిన స్త్రీ నిధి కి సంబంధించిన బ్రోచర్లను కూడా ఆవిష్కరించారు.

జాతీయ స్థాయి గట్కా పోటీలకు సత్యవరం విద్యార్థులు



హెచ్‌ఎం, పీఈటీలతో గట్కా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నరసన్నపేట: సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయి గట్కా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12 వ తేదీల్లో చత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గ్‌లో జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. దీంట్లో రాష్ట్రం తరఫున సత్యవరం స్కూల్ విద్యార్థులు టెంక జానకీరాం, పాసి పుష్ప, పాసి రాఘవేంద్ర, ఎ.శరత్‌కుమార్, దర్శి నిలు ఎంపికయ్యారని హెచ్‌ఎం వకులా రత్నమాళ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను స్కూల్ హెచ్‌ఎం వకులా రత్నమాళ, పీఈటీ జ్యోతి రాణితో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

శ్రీముఖలింగం ఆలయం ఈఓగా ఏడు కొండలు



ఈఓ ఏడు కొండలు

జలుమూరు: శ్రీముఖలింగం ఆలయ ఈఓగా కె.ఏడుకొండలు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయనగరం జిల్లా పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న వాసుదేవరావు పాతపట్నం నీలమణి అమ్మవారి దేవస్థానానికి వెళ్లారు.

నేటి నుంచి విద్యాశక్తి కార్యక్రమాల బహిష్కరణ



డీఈఓ రవిబాబుకు మెమోరాండం అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా శాఖ సభ్యులు

శ్రీకాకుళం: ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తప్ప మరే బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులు చేయబోరని జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీలు బమ్మిడి శ్రీరామమూర్తి, పడాల ప్రతాప్ కుమార్‌లు తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో శాఖ పిలుపు మేరకు జిల్లా ఫ్యాప్టో శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఈఓ ఎ.రవి బాబులకు మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో బి.రవి కుమార్, బి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం అసోసియేషన్ వి.సత్యనారాయణ, జి.రమణ, ఎస్ రమేష్ బాబు, బి.రవి, సూర్య ప్రకాష్ తదితరలు పాల్గొన్నారు.

నలుచెరగులా.. నిరసన జ్వాల



- ప్రజా వ్యతిరేక పాలనపై భగ్గుమంటున్న సంఘాలు
- ఒకవైపు థర్మల్, మరోవైపు కార్గో పోర్ట్‌కు వ్యతిరేకంగా నిరసనలు
- ఇంకోవైపు ఉద్యోగుల ఆందోళనలు
- సంక్షేమ పథకాల కోతలు, రద్దుతో మండి పడుతున్న జనం

లెక్కా పక్కా లేకుండా బడులు విలీనం చేశారని విద్యార్థి లోకం రోడ్డెక్కింది. విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోయారని యావత్తు రైతాంగం భగ్గుమంది. భూములు లాగేసుకుంటున్నారని ఉద్దానం వాసులు ఉద్యమానికి ఊపిరి పోస్తున్నారు. పల్లెను నాశనం చేయాలనుకుంటున్నారని థర్మల్‌కు వ్యతిరేకంగా ఆదివాసీలు ఆగ్రహోదగ్రులవుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఉద్యోగ వర్గంలో నిరసన జ్వాల ఉవ్వెత్తున ఎగసిపడుతోంది. 'కూటమి' పనితనానికి, పాలనకు నిదర్శనాలివి. నలుచెరగులా అంటుకుంటున్న నిరసన జ్వాలల వెలుగులో సర్కారు అసమర్థత బయటపడుతోంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఏడాదిన్నర పాలన కాలంలోనే కూటమి అన్ని వర్గాల ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకుంది. జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను, అభివృద్ధి పనులు పూర్తి చేయకపోగా కొత్త సమస్యలు సృష్టించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఉన్న పథకాలను తీసేసి పేరు మార్చిన కొన్ని పథకాలకు కోతల పెడుతున్నారు. ఇవి చాలదన్నట్టు ప్రజా వ్యతిరేక ప్రాజెక్టులను జిల్లా ప్రజల నెత్తిన పెట్టేందుకు ప్రయత్నించడంతో పచ్చని పల్లెల్లో చిచ్చు రేగుతోంది.

థర్మల్, కార్గో మంటలు..



థర్మల్ పవర్ ప్రాజెక్టుపై ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలు భయాందోళనకు గురై రోడ్డెక్కుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో రూ.30వేల కోట్లతో 1500 ఎకరాల్లో థర్మల్ క్రిటికల్ సూపర్ ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించాలని చూస్తోంది. దీనిపై ఆదివాసీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సర్కారు పచ్చని ఉద్దానాన్ని కూడా వదలడం లేదు. దాదాపు 16 గ్రామాల్లో ఎఫెక్ట్ అయ్యేలా 1453 ఎకరాల్లో కార్గో ఎయిర్ పోర్టుకు ప్రతిపాదనలు చేసింది. విలువైన వ్యవసాయ భూములు కావడంతో అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఉద్యోగుల్లో ఆగ్రహం

కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోవడంతో ఉపాధ్యాయ, ఉద్యోగులు పెద్ద ఎత్తున మండిపడుతున్నారు. తమకు ఒక్క మేలు చేయలేదని జిల్లాలో 9600మంది ఉపాధ్యాయులు, 28వేల మంది వివిధ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై భగ్గుమంటున్నారు. 7వేల మందికి పైగా సచివాలయం ఉద్యోగుల ఆవేదన కూడా అరణ్య రోదనగా మారిపోయింది. వీరితో పాటు విద్యుత్ ఉద్యోగులు సమ్మె బాట పడుతున్నారు.

ప్రజా వ్యతిరేకత

పేద విద్యార్థుల కోసం గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను నిర్మిస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమవ్వడంపై దళిత, బీసీ, మైనారిటీ, అగ్రకులాల పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అయితే ఏకంగా ఉద్యమానికి సిద్ధమైంది. దీనికి తోడు రైతులను నిలువునా పాలకులు మోసం చేశారు. ఎరువులను ఇళ్లకు తీసుకెళ్లి పంపిణీ చేశారు. విద్యుత్ వాతల కోసమైతే చెప్పనక్కర్లేదు. దశల వారీగా చార్జీలు పెంచేశారు. స్త్రీ శక్తి పథకం ఆటో డ్రైవర్ల ఉపాధికి గండికొట్టింది. కంటి తుడుపు సాయం కూడా వారి గాయాన్ని మాన్పలేదు.



సంక్షేమ పథకాలకు కోత



కూటమి ప్రభుత్వం 143 హామీలిచ్చి వాటిలో నాలుగైదు అమ లు చేసి, అమలైన వాటిలో ఆంక్షలు పెట్టి కోత విధించిన ప్రభుత్వంగా మిగిలిపోయింది. ఉచి త గ్యాస్‌కైతే ఒక విడత ఇచ్చి మంగళం పాడేసింది. తల్లికి వందనం నిబంధనల చట్రంలో లక్షలాది మందికి ప్రయోజనం అందకుండా చేసింది. మత్స్యకారుల వేట భృతి, అన్నదాత సు ఖీభవ తదితర పథకాలు కూడా అరకొరగా అమలు చేసింది. విద్యార్థులకు ఫీజు కష్టాలు తప్పలేదు. రీయింబర్స్‌మెంట్ చేయలేదు. ఆడబిడ్డకు సంబంధించిన సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. భృతి ఇవ్వకుండా నిరుద్యోగ యువతను ముంచేసింది.

సెంటు భూమి ఇచ్చేది లేదు



పచ్చని ఉద్దానం మాది. కార్గో ఎయిర్ పోర్టు అంటే మాకు గొడ్డలి పెట్టు లాంటిది. అది మాకు కానీ, మా ప్రాంతానికి, ప్రజలకు కానీ అవసరం లేదు. దీనికి సెంటు భూమి కూడా ఇచ్చేది లేదు. - కొమర వాసు, ఎం.గంగువాడ, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు

నిరసన కొనసాగుతుంది



ఉన్నత విద్యార్హతలతో సచివాలయ ఉద్యోగాల్లో చేరిన మాపై ఈ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. దీనిపై మా నిరసన కొనసాగుతుంది. - కూన వెంకట సత్యనారాయణ, ఉత్తరాంధ్ర సచివాలయ ఉద్యోగుల జేఏసీ కోఆర్డినేటర్

15 నుంచి నిరవధిక సమ్మె తప్పదు



విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం మాట తప్పుతోంది. అందుకే ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నాం.

- ననవల వెంకటరావు, విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కోకన్వీనర్

ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం..



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. అందుకే ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మొన్న ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా చేశాం. ప్రభుత్వం దిగి రాక పోతే పోరును ఉద్ధృతం చేస్తాం.
- బి.శ్రీరామమూర్తి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

తల్లికి వందనం పడలేదు




కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన దళిత నిరుపేద కుటుంబం మాది. ప్రస్తుతం మా పాప వెన్నెల 8వ తరగతి చదువుతుండగా, మా అబ్బాయి జశ్వంత్ ఇంటర్ చదువుతున్నాడు. తల్లికి వందనం పథకంలో మా పాప పేరున రూ.10,900 నా భార్య అకౌంట్‌లో జమ చేశారు. మా అబ్బాయికి నయా పైసా కూడా రాలేదు. ఇదెక్కడి న్యాయం.
- బలగ డొంబురు. బొరివంక, కవిటి మండలం

వేడుకేదైనా..

వేదిక వెలిగిపోవాల్సిందే..!

- ప్రత్యేక అలంకరణకు ప్రాధాన్యమిస్తున్న జనం
- వేడుకను బట్టి అలంకరణ సామగ్రి



మార్కెట్లో లభ్యమవుతున్న విభిన్న అలంకరణ సామగ్రి

శ్రీకాకుళం కల్చరల్: వేడుక ఏదైనా జిల్లా వాసులు వేదికలను మాత్రం అదరగొడుతున్నారు. సాదాసీదా అలంకరణలకు టాటా చెప్పేసిన జిల్లా వాసులు ప్రత్యేక థీమ్‌లతో పండుగలు, ఉత్సవాలకు కొత్త సొబగులు అద్దుతున్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఈ అలంకరణల అలవాటు బాగా పెరిగింది. వీరి అభిరుచికి తగ్గట్టు మార్కెట్‌లోనూ కొత్త దుకాణాలు వెలిశాయి.

మార్కెట్లో పెరిగిన డిమాండ్

జిల్లా కేంద్రంలోని పెట్రోమాక్సు వీధిలో ఒకే చోట సుమారుగా 10 షాపులు ఉన్నాయి. వీటిలో అన్ని శుభకార్యాలకి సంబంధించిన వస్తువులను షాపుల్లో అమ్ముతున్నారు. వినియోగదారులు వీటిని కొనుగోలు చేసి తమ ఇళ్లన్లు తామే అలంకరించుకుంటున్నారు. తాము చేసిన డెకరేషన్‌ను ఫేస్‌బుక్‌లలో, ఇన్‌స్టాగ్రామ్ తదితరమైె వాటిలో పెడుతూ వైరల్ చేస్తున్నారు.

స్థాయిని బట్టి ఖర్చు

సందర్భానికి తగ్గట్టుగా అలంకరణలను ప్లాన్ చేస్తున్నారు. గోడ సైజును బట్టి పెట్టేందుకు కర్టెన్లు, ఆకులు, పుష్పాల పెయింటింగ్‌లతో అమ్ముతున్నారు. పేద, మధ్య తరగతి వారు కూడా ప్రతి చిన్న కార్యక్రమానికి అలంకరణలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా కరోనా తర్వాత ప్రతి కార్యక్రమాన్ని పండగలా జరుపుకుంటున్నారు. పెద్ద పెద్ద పెళ్లిళ్లు, పుట్టిన రోజులు, షష్టిపూర్తి, బారసాల, పెద్దపూజలు వంటి సయంలో డెకరేటర్లను పిలిపించుకుని మరీ అలంకరణలు చేయించుకుంటున్నారు.

అలంకరణలకు ప్రాధాన్యత పెరిగింది



మార్కెట్‌లో అలంకరణ వస్తువులకు గిరాకీ పెరిగింది. దేవుడి పూజలకు కూడా అలంకరణ వస్తువులు కొంటున్నారు.

- దాస్యం రాంబాబు, అలంకరణ సామగ్రి షాపు యజమాని

ఫంక్షన్లకు పిలుస్తారు..



పుట్టిన రోజులు, పూజలు తదితర ఫంక్షన్లకు నన్ను పిలుస్తారు. కొన్ని బెలూన్లతో, మరికొన్ని అలంకరణ వస్తువులతో డెకరేషన్ చేస్తుంటాను. ఇటీవల వినాయక చవితికి వైకుంఠద్వారం తయారు చేశాను. - దాకోజు లాల్ ప్రసాద్, డెకరేటర్, కంపోస్టు కాలనీ

భారీస్థాయిలో కూడా చేస్తాం



మేము భారీ స్థాయి నుంచి చిన్న స్థాయి వరకు ఎవరికి ఏ విధంగా కావాలో వాటిని తయారు చేస్తాం. అవుట్‌డోర్, ఇండోర్‌లో కూడా డెకరేషన్ చేస్తాం.

- గోపి, ఎంజీఆర్ క్లాత్ డెకరేటర్, శ్రీకాకుళం

'కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే థర్మల్ ప్లాంట్'



సమావేశంలో మాట్లాడుతున్న వాబ యోగి

బూర్జ: బడా కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టేందుకే థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మించ తలపెడుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. గురువారం మండలంలో గల అన్నంపేట పంచాయతీ మసానపుట్టి గ్రామంలో ఆదివాసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల జీవితాలతో పాటు పర్యావరణాన్ని నాశనం చేసే క్రిటికల్ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ ఈప్రాంతంలో నిర్మాణం చేపట్టవద్దని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ, మాజీ మంత్రి వర్యులు వద్దే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పచ్చని ప్రకృతిని, సంప్రదాయాలను కాపాడాల్సిన పాలకులు ఆదివాసీలు జీవించే హక్కు లేకుండా చేస్తున్నారని మండి పడ్డారు. 32 వేల మెగా వాట్స్ సామర్థ్యంతో ఇక్కడ పవర్ ప్లాంట్ నిర్మిస్తే ఆదివాసీలతో పాటు రైతులు జీవిస్తున్న ఈ ప్రాంతమంతా శ్మశానంగా మారుతుందన్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రతిపాదన తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సలహాదారుడు మహదేవ్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, నూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, లిబరేషన్ రాష్ట్ర నాయకులు మరనాథ్, అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకల మాధవరావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్ దొర, కార్యదర్శి సవర సింహాచలం, కోశాధికారి రవికాంత్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, కుసుమ, ప్రజాసంఘాల నాయకులు, కె.మోహనరావు, ఆదివాసీలు, దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దారులు.. రక్తపు ధారలు



- హైవేలపై నిత్యం ప్రమాదాలు
- ఒక్క సెప్టెంబర్‌లోనే 10 మరణాలు
- బ్లాక్ స్పాట్లు గుర్తించడంలో పోలీసుల వైఫల్యం



పెద్దపాడు అప్పన్నమ్మ గుడి సమీప ప్లై ఓవర్ కింద సర్వీసు రోడ్డులో ఆగిన లారీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో జాతీయ రహదారిపై రక్తపు ధారలు కనిపిస్తున్నాయి. జాతీయ రహదారితో పాటు అనుసంధాన దారుల్లో ఒక్క సెప్టెంబర్ నెలలోనే 10 మరణాలు సంభవించాయి. ఘోర ప్రమాదాలు సంభవిస్తున్నా బ్లాక్ స్పాట్లు గుర్తించడం, ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, హైవే కనెక్టివిటీ జంక్షన్లవద్ద విధుల్లో సిబ్బందిని పెట్టడం, డివైడర్లను నిర్మించడం, నిబంధనలు పాటించని వారిపై కొరడా ఝుళిపించడంలోను జిల్లా పోలీసు, రవాణా యంత్రాంగాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకుంటున్నారా..?



జిల్లా జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల్లో 2024కు ముందు 57 బ్లాక్‌స్పాట్‌లు గుర్తించారు. ప్రమాదాల సంఖ్య అప్పటికంటే ఇప్పుడు పెరుగుతున్నా కొత్త బ్లాక్‌స్పాట్‌లు గుర్తించడంలో విఫలమవుతున్నారు. నిత్యం హైవే రహదారులు, వాటికి కనెక్టివిటీగా ఉన్న సర్వీసురోడ్లులో భారీ వాహనాలు రోజుల తరబడి నిలిపేస్తున్నా పట్టించుకునే వారే లేరు. హైవే మొబైల్ పెట్రోల్ వాహనాలు పదికి పైగా ఉన్నా తక్షణమే స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. పెద్దపాడు జాతీయ రహదారి టీవీఎస్ షోరూం వద్ద జరిగిన ఓ ప్రమాదంలో క్షతగాత్రుడు కొట్టుమిట్టాడుతుంటే ఈ వాహనమే కాదు అంబులెన్సు సైతం సకాలంలో రాలేదు. ఇదే మాదిరి పాత్రునివలస, నరసన్నపేట జమ్ము కూడలి వద్ద జరిగింది. కంచిలి వద్ద లారీ ఎక్కించి ఇద్దరి మరణానికి కారణమైన ఘటనలో ప్రమాదవశాత్తు జరిగినదిగా పోలీసులు చిత్రీకరించేందుకు చూశారు. స్థానికులు గట్టిగా ఎదురుతిరగడంతో రూటు మార్చారు. ఇకపోతే గ్రావెల్, ఇసుకాసురులు లారీలు, ట్రిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తుండటంతో ఎక్కడికక్కడే జాతీయ రహదారులపై కుప్పకుప్పలుగా పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా స్థానిక పోలీసులు పట్టించుకోవడంలేదు.

ప్రమాదకర జంక్షన్లు ఇవే..

- ఇచ్ఛాపురం- కంచిలి-సోంపేటలో.. బేసిరామచంద్రపురం, జలంతర్‌కోట, జాడుపూడి-మఖరాపురం సంత, బెల్లుపడ-ఈదుపురం కూడలి, పురుషోత్తపురం చెక్‌పోస్టు, సుమండి జంక్షన్, బలరాంపేట, బూరగాం, కొర్లాం.
- పలాస- హరిపురంలో.. కొర్రాయిగేటు, కోసంగిపురం, రామకృష్ణాపురం, మొగిలిపాడు, బెండి గేట్ కొత్తఅగ్రహారం.
- నందిగాం-టెక్కలి-కోటబొమ్మాళిలో.. కొత్త అగ్రహారం, సుభద్రాపురం, పెద్దతామరాపల్లి, నర్సిపురం అడ్డురోడ్డు, జగతిమెట్ట, సాకిపల్లి కొత్తూరు, కన్నెవలస-మంచాలపేట, జర్జంగి, నిమ్మాడ.
- నరసన్నపేటలో.. జమ్ముకూడలి, కోమర్తి, దేవాది, మడపాం.
- శ్రీకాకుళం-ఎచ్చెర్లలో.. సింగుపురం, మునసబ్‌పేట, పెద్దపాడు, కొత్తరోడ్డు, పాత్రునివలస, ఫరీద్‌పేట కొయ్యిరాళ్ల, నవభారత్, కుశాలపురం, కింతలి, చిలకపాలెం కూడళ్లు.
- జె.ఆర్.పురంలో.. పైడిభీమవరం, రణస్థలం, బుడుమూరు.



టెక్కలి జగతి మెట్ట ప్లై ఓవర్ సమీప సర్వీసు రోడ్డులో డివైడర్ లేని దృశ్యం

స్పాట్లు గుర్తిస్తున్నాం..



ప్రమాదాలు నియంత్రించేందుకు సూచీ బోర్డులు పెడుతున్నాం. ఎక్కడికక్కడ వేగ నియంత్రికలు ఏర్పాటు చేశాం. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా తనిఖీలు నిత్యం చేస్తూ ఫైన్లు విధిస్తున్నాం. ఐదుకి మించి ప్రమాదాలు జరుగుతున్న స్పాట్లు గుర్తించాం.

- కేవీ మహేశ్వర రెడ్డి, ఎస్పీ

'నష్టపరిహారం అందించాలని ధర్నా'



జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, క్వారీ కార్మికులు

టెక్కలి రూరల్: మెళియాపుట్టి మండలం గంగరాజపురం సమీపంలో గల రాజయోగి గ్రానైట్ క్వారీలో మంగళవారం పిడుగుపడి మృతి చెందిన, తీవ్రంగా గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ.. గురువారం జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో టెక్కలి జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా జనరల్ సెక్రటరీ పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ పిడుగుపాటుతో పాటు ఎలక్ట్రికల్ షాక్ తగలడం వల్లనే ముగ్గురు మృతి చెందారని ఆరోపించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు క్వారీ యాజమాన్యం రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి రావాల్సిన బీమాలన్నీ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి హెచ్.ఈశ్వరరావు, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చింతాడ తేజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నంబూరి షణ్ముఖరావు, క్వారీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వెళ్లొద్దు మేడమ్.. ప్లీజ్



గురుశిష్యుల ప్రేమకు సాక్ష్యమీ చిత్రం. ఇచ్ఛాపురం మండలం కొఠారీ ప్రాథమిక పాఠశాలలో ఐదేళ్లగా ఉపాధ్యాయురాలిగా పనిచేసిన ముక్కక్ష శ్రావణికి మూడు నెలల కిందటే బదిలీ జరిగింది. ఇప్పుడు ఆమె రిలీవ్ కావడంతో పిల్లలు ఆమెను వదిలిపెట్టలేక ఇలా బోరు మన్నారు. విద్యార్థులు టీచర్‌పై చూపిన అభిమానాన్ని చూసి తోటి గురువుల కళ్లు కూడా చెమ్మగిల్లాయి. పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు టీచర్‌ను గురువారం ఘనంగా సాగనంపారు.

- ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

'స్పిరిట్ కలపలేదు'

శ్రీకాకుళం క్రైమ్ : సారవకోట మండలం ఆవలంగి గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు గత నెల 3న పట్టుకున్న నకిలీ మద్యం కేసుపై పాతపట్నం సీఐ కోటు కృష్ణారావు గురువారం వివరణ ఇచ్చారు. రోడ్డుపై ఖాళీ మద్యం బాటిళ్లు ఏరుకుంటున్న వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఆ రోజున 211.90 లీటర్ల నకిలీ మద్యం పట్టుకున్నామని, దుర్గా వైన్‌షాపులో అనధికారికంగా అమ్మకాలు జరుపుతున్న ఐదుగురు ముద్దాయిలను గుర్తించామన్నారు. స్పాట్‌లోనే ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, షాపు లైసెన్సుదారున్ని అదే నెల 15న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. లేబ్ రిపోర్టు ప్రకారం మద్యంలో ఎటువంటి స్పిరిట్ ఉపయోగించలేదని చెప్పారు. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు వచ్చే లక్షలాది ప్రజల డిమాండ్ దృష్ట్యా రూ.99బాటిళ్లలోని మద్యాన్ని నీటితో కలిపి రూ.160 మద్యం సీసాలలో నింపుతున్న సమయంలో పట్టుకున్నట్లు వివరించారు. ముద్దాయిలు సకలాభక్తుల నీలకంఠేశ్వరరావు, పిట్ట పైడిరాజు హైకోర్టు నుంచి ఏంటిసిపేటరి బెయిల్ తెచ్చుకున్నారు తప్ప ఈ కేసు నుంచి ఎవరినీ తప్పించలేదన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి



చిన్నారులతో ముచ్చటిస్తున్న సినీ నటుడు సొహైల్

సోంపేట: తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు పట్టుదలతో చదవాలని బిగ్‌బాస్ ఫేం, సినీ నటుడు సొహైల్ అన్నారు. గురువారం సోంపేటలోని మహర్షి విద్యానికేతన్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ముందుగా కంచిలిలో కంచమ్మ తల్లిని దర్శనం చేసుకున్నారు. అనంతరం సోంపేట మహర్షి విద్యానికేతన్ యాజమాన్యంతో ఉన్న పరిచయం మేరకు పాఠశాలకు వచ్చి చిన్నారులతో సందడి చేశారు.

బొల్లినేని విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ఫలితాల్లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. డిస్టింక్షన్‌లో 15 మంది, ప్రథమ శ్రేణిలో 43 మంది, ద్వితీయ శ్రేణిలో ఏడుగురు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీపద్మజ మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రతీ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

మసిబారుతున్న బతుకులు



జీడి పిక్కలను కట్ చేస్తున్న మత్స్యకార మహిళలు



రంగు మారిన కార్మికురాలి చేతులు

- జీడి పరిశ్రమల్లో మగ్గుతున్న మహిళలు
- కానరాని కనీస సౌకర్యాలు
- పట్టించుకోని అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్:

ఉద్దాన ప్రాంతంలో లక్షలాది మంది రైతులు జీడి పంటను సాగు చేస్తూ జీవనోపాధి సాగిస్తుంటే.. పరోక్షంగా వేలాది మంది కార్మికులు జీడి పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇదంతా అంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. వేలాది మంది మహిళలు ఉపాధి మార్గాలు లేక తమ సంప్రదాయ వృత్తులను వీడి జీడి కార్మికులుగా మారుతున్నారు. పిక్కలను కట్ చేసేటప్పుడు, పిక్క నుంచి జీడి గుడ్డును వేరు చేసేటప్పుడు హానికరమైన జీడి చేతులకు తగిలి ఎంతోమంది మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారు.

పల్లెలకు పాకిన జీడి పరిశ్రమలు:

ఒకప్పుడు కాశీబుగ్గ, పలాస పట్టణాలకు పరిమితమై జీడి పరిశ్రమలు నేడు పల్లెలకు పాకుతున్నాయి. కాశీబుగ్గ ఇండస్ట్రీయల్ ఏరియాతో పాటు పలాస, టెక్కలిపట్నం రోడ్డు, గరుడబద్ర, అక్కుపల్లి, పాత టెక్కలి, అమలపాడు పరిసర ప్రాంతాల్లో దాదాపుగా 150 పరిశ్రమలు ఉన్నాయి. తాజాగా, నువ్వలరేవు, డోకులపాడు, చినడోకులపాడు, కొండవూరు, చినవంక,మందస మండలంలో గల మారు మూల ప్రాంతాలలో అదనంగా సుమారు 200 జీడి పరిశ్రమలను నెలకొల్పారు.

కష్టానికి ఏదీ ప్రతిఫలం..

కొందరు జీడి పరిశ్రమ యజమానులు, వ్యాపారులు తమ లాభార్జన చూసుకుంటున్నారే తప్పా పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం, భద్రత పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నువ్వలరేవులో వందలాది మంది మత్స్యకార మహిళలు సంప్రదాయ చేపల వృత్తిని వదిలి జీడి కార్మికులుగా మారారు. రోజుకు 10 –15 కిలోల జీడి పిక్కలు వలుస్తుంటారు. కేజీ పిక్కలను రూ. 24 మాత్రమే ఇస్తుండటంతో కూలీ సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్మిక అధికారులు స్పందించి తమకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కానరాని భద్రతా చర్యలు..

కార్మికులు పని చేసే చోట మరుగుదొడ్లు వంటి కనీ స వసతులు లేకపోవడంతో మహిళా కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. చేతులకు గాయాలు కాకుండా కనీసం రక్షణ సామగ్రి సమకూర్చడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్మికులు అనారోగ్యానికి గురైనా యజమానులు నుంచి ఎలాంటి సహాయం అందడం లేదని పలువురు వాపోతున్నారు. చేతికి రక్షణ లేకుండా పని చేయడం వల్ల వేలి ముద్రలు అరిగిపోవడంతో ప్రభుత్వ పథకాల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేమే కొనుక్కున్నాం..

మేం మత్స్యకారులమైనా చేపలు అమ్మకాలు చేయలేం. ఊరిలోనే ఉపాధి దొరకటంతో జీడి పరిశ్రమలో చేరాం. రోజుకు 20 కేజీల వరకు జీడి తొక్క తీస్తాం. కేజీ పిక్క తీయడానికి రూ. 28 ఇస్తున్నారు. చేతికి రక్షణ కోసం మేమే గ్లౌజ్‌లు కొనుక్కున్నాం.

– ముప్పల తోపే, జీడి కార్మికురాలు, నువ్వలరేవు

చర్యలు తీసుకుంటాం..

జీడి పరిశ్రమలలో కార్మిక చట్టాలను అతిక్రమిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిశీలిస్తున్నాం. ప్రతి కార్మికుడు ఈ–శ్రామిక్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.


– పి.విజయ్‌కుమార్, కార్మిక శాఖాధికారి, పలాస



చేతికి రక్షణ లేకుండానే జీడి పప్పును వేరు చేస్తున్న కార్మికులు

మాస్టర్‌ప్లాన్‌లో మార్పు!

- సర్వే చేస్తున్న నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం
- ప్రభుత్వానికి త్వరలో నివేదిక



మాస్టర్ ప్లాన్(ఫైల్)

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం మేరకు శ్రీకాకుళంలో అమలు చేయాలనుకుంటున్న కొత్త మాస్టర్ ప్లాన్ విషయంలో జిల్లా అధికారులు పునరాలోచనలో పడ్డారు. 'మాస్టర్ ప్లాన్‌తో గుండెల్లో గుబులు' పేరిట రెండు రోజుల క్రితం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. 150 అడుగులు రోడ్డును నిర్మిస్తే ఏయే ప్రాంతాలు దెబ్బతింటాయో పరిశీలించాలని నగరపాలక సంస్థ, సుడా అధికారులను ఆదేశించారు. దీంతో ఆయా శాఖలోని ప్రణాళికా విభాగం అధికారులు మంగళ, బుధవారాల్లో సర్వే నిర్వహించారు. ఈ రోడ్డు పరిధిలో ఏయే భవనాలు దెబ్బతింటాయో పరిశీలించి నివేదించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీని ఆధారంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేసి, ప్రభుత్వానికి నివేదించాలని నిశ్చయించారు. అటు తర్వాత మాస్టర్ ప్లాన్ వల్ల ఆలయాలు, అపార్ట్‌మెంట్లు, భవనాలు, ఆస్పత్రులు దెబ్బతింటాయని జిల్లా ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రభుత్వానికి నివేదించి, కొత్తగా చేసిన మార్పుల మేరకు ప్రభుత్వం ఆమోదించేలా చేయాలని నిర్ణయించారు. అయితే ఈ రోడ్డు వేయాలనుకునే ప్రాంతంలో ఖాళీ స్థలాలు ఉన్న పక్షంలో వాటిలో మాత్రం ఎటువంటి మార్పులు లేకుండా, కేవలం నగరపాలక సంస్థ అనుమతితో నిర్మించిన భవనాలను ఉంటే వాటిని పరిగణలోనికి తీసుకుంటారని సమాచారం.

ఆదేశాలు వచ్చాయి..

మాస్టర్ ప్లాన్‌లో చిన్న చిన్న మార్పులు చేయాలని జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలు మేరకే సర్వే చేస్తున్నాం. ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తాం. గతంలో ఆమోదించిన మాస్టర్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు చేసి భవనాలు లేని ప్రాంతం నుంచి 150 అడుగుల రోడ్లు, ఇతర రోడ్లు నిర్మాణం అయ్యేలా కొత్తప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం. జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా కొత్తగా ప్లాన్ తయారుచేసి తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

– ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

సారాపై ఉక్కు పాదం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నాటుసారా తయారీ విక్రయాన్ని పూర్తిగా అరికట్టడానికి 'నవోదయం 2.0' కార్యక్రమం కింద కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సారా రహిత జిల్లా లక్ష్యం సాధించే వరకు దాడులు, నిఘా కొనసాగుతాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఫిబ్రవరి నుంచి తీసుకున్న చర్యల వివరాలను కలెక్టర్‌కు సమర్పించారు. ఇప్పటివరకు 179 ఐడీ లిక్కర్ కేసులు నమోదు చేయగా, 221 మందిని అరెస్టు చేశామని, 3477.8 లీటర్ల ఐడీ మద్యం స్వాధీనం చేసుకోగా, 27,790 లీటర్ల జీఎఫ్ (ఎఫ్‌జె) వాష్‌ను ధ్వంసం చేశామని వివరించారు. 75 కిలోల బెల్లం, 17 వాహనాలను అధికారులు సీజ్ చేశామన్నారు. బెల్లం సరఫరాదారులపైనా దృష్టి సారించి, ఆరుగురు వ్యాపారులను కూడా అరెస్టు చేసినట్టు వెల్లడించారు. సారా గురించి సమాచారం తెలిస్తే 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్ తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

- నాలుగు నెలల కిందటే వివాహం
- దేవునల్తాడలో విషాదఛాయలు



చినబాబు(ఫైల్)



మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు: దేవునల్తాడ గ్రామానికి చెందిన బుడగట్ల చినబాబు(42) సముద్రంలో చేపల వేట కు వెళ్లి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవునల్తాడకు చెందిన బుడగట్ల కేశవులు, గుణసరఐమ్మ కుమారుడు చినబాబుకు నాలుగు నెలల క్రితం ఒడిశా రాష్ట్రం పూరీకి చెందిన నారాయణమ్మతో వివాహం జరిగింది. జీవనోపాధిలో భాగంగా గురువారం వేకువజామున తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. ఉదయం 8 గంటల సమయంలో వలను లాగే ప్రయత్నంలో అలలు ఎగసిపడటంతో చినబాబు తెప్ప నుంచి జారి పడి మృతి చెందాడు. విషయాన్ని సర్పంచ్ టి.వరదరాజులు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.వెంకన్న, గ్రామ పెద్దలు వజ్రపుకొత్తూరు పోలీసులకు తెలియజేయడంతో సిబ్బంది తీరానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి బుడగట్ల గుణసరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రపుకొత్తూరు హెచ్‌సీ కె.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

శ్రీకాకుళం రూరల్: సింగుపురం ఫ్లెటైర్ బ్రిడ్జిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఫార్చునర్ వాహనంలో విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వెళ్తుండగా అదే రూట్‌లో వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు.

12న సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు ఎంపికలు ఈ నెల 12న జరగనున్నాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూన రవికుమార్, ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు గురువారం తెలిపారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా ఉదయం 10 గంటలకు ఎంపికల ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94410 11391 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా సేవలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీలపై ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, పీజీఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు, తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే పని ప్రజలకు సంతృప్తికరంగా ఉండాలన్నారు. పని ఒత్తిడి ఉన్నా అత్యవసరమైన పనులకు తప్పని పరిస్థితుల్లో హాజరు కావాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో సీఎస్‌డీటీలు కీలకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్లు జి.జయదేవి, పద్మావతి, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు సేవలకు బ్రేక్

- నాలుగు రోజుల పాటు అంతరాయం
- బ్యాంకుల విలీన ప్రక్రియే కారణం
- 13న తిరిగి సేవలు ప్రారంభం



ఎల్ఎన్‌పేటలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు

హిరమండలం:

జిల్లాలో ఏపీ గ్రామీణ బ్యాంకు సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి అన్ని రకాల ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఖాతాదారులకు వివిధ మాధ్యమాల ద్వారా ఇప్పటికే బ్యాంకు అధికారులు తెలియజేశారు. మళ్లీ ఈ నెల 13న ఉదయం 10 గంటలకు సేవలు ప్రారంభంకానున్నాయి. గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ ఇందుకు కారణం. కొద్దిరోజుల కిందట నాలుగో విడత బ్యాంకుల విలీన ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఒక రాష్ట్రంలో ఒక గ్రామీణ బ్యాంకు మాత్రమే ఉండాలని సూచించింది. దీంతో రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులన్నీ విలీనం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారనున్నాయి. 4 గ్రామీణ బ్యాంకులను విలీనం చేసే ప్రక్రియలో భాగంగానే సాంకేతిక అంశాలను సరిచేసేందుకు సేవలు నిలిపివేసినట్టు బ్యాంకు వర్గాలు తెలిపాయి.

80 బ్రాంచ్‌లలో..

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలో 278 శాఖలు ఉన్నాయి. మన జిల్లాకు సంబంధించి 80 శాఖలు ఉన్నాయి. ఈ నెల 13 నుంచి ఈ శాఖలన్నీ ఏపీ గ్రామీణ బ్యాంక్‌గా సేవలందించనున్నాయి. మరోవైపు ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ సేవలు సైతం నిలిచిపోయాయి. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, ఏటీఎం సేవలు, బ్యాంక్ మిత్ర సేవలు కూడా నిలిచిపోయాయి. దీంతో అత్యవసర పనులు ఉన్న ఖాతాదారులు అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా ఏపీజీవీబీల్లో స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజల సేవలు ఉంటాయి. ఇప్పటికే ఖాతాదారులకు బ్యాంకు వర్గాలు సమాచారం ఇచ్చినా, కొందరికి విషయం తెలియక అసౌకర్యానికి గురయ్యారు.

సహకరించాలి



గ్రామీణ బ్యాంకుల్లో సేవలు నిలిపివేతపై ఇప్పటికే ఖాతాదారులకు సమాచారం ఇచ్చాం. విలీన ప్రక్రియలో భాగంగానే సాంకేతిక అంశాలను సరిచేస్తున్నారు. ఖాతాదారులు ఈ విషయంలో సహకరించాలి. 13న తిరిగి సేవలు ప్రారంభం కానున్నాయి.

– పి.వెంకటనారాయణ, బ్రాంచి మేనేజర్, ఏపీజీబీ, ఎల్ఎన్‌పేట

సీపీఎం నేతలపై కేసు కొట్టివేత

కొత్తూరు: వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2016లో పోరాటం చేసిన సీపీఎం నేతలపై అప్పటి టీడీపీ ప్రభుత్వం పెట్టిన కేసును గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కొట్టివేసినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు తెలిపారు. సీపీఎం జిల్లా నాయకులు భవిరి కృష్ణమూర్తి, గంగరాపు సింహాచలం, కె.నాగమణి, సిర్ల ప్రసాద్, కె.మిన్నారావు, శంకరరావు, ఆఫీస్, ముఖలింగం తదితరులకు విముక్తి లభించింది. కేసును అడ్వకేట్ మహంతి అప్పారావు వాదించారు.

బాలికను మోసగించిన యువకుడిపై కేసు

బూర్జ: ఎ.పి.పేట పంచాయతీ గోపిదేవిపేట గిరిజన గ్రామానికి చెందిన బాలిక(17) అదే గ్రామానికి చెందిన యువకుడు సవర పవన్‌కుమార్ ప్రేమపేరుతో మోసం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలిక తల్లిదండ్రులు చెన్నైలో తాపీ పనికి వెళ్లడంతో అమ్మమ్మ తాతయ్య వద్ద తమ్ముడితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో మేనమామ వరసైన పవన్‌కుమార్ ప్రేమ పేరుతో వెంటపడి గర్భవతిని చేశాడు. పెళ్లికి తిరస్కరించడంతో బాధితురాలు గురువారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సివిల్ ఇంజినీరింగ్ (ఒకేషనల్ కోర్సు) గ్రూపులో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హెచ్.పద్మలత గురువారం తెలిపారు. సంబంధిత గ్రాడ్యుయేషన్ కోర్సులో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5గంటలలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, ఈ నెల 15న శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అక్రమ బదిలీలు నిలిపివేయాలి

శ్రీకాకుళం: తమకున్న పలుకుబడితో అంతర్ రాష్ట్ర బదిలీలకు తెరతీస్తున్న ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు గురువారం డిమాండ్ చేశారు. ఇకపై ఉపాధ్యాయ బదిలీలన్నీ పారదర్శకంగా, చట్టబద్ధంగా, అవినీతి, అక్రమాలు లేని విధంగా చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని, ఇప్పుడు పలుకుబడి బదిలీలు చేపట్టడం దారుణమన్నారు. బదిలీలు నిలుపుదల చేయనిపక్షంలో న్యాయపోరాటం తప్పదన్నారు.


చినుకు పడితే చెరువే

- జలమయమవుతున్న రహదారులు
- రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులకు ఇక్కట్లు
- పల్లె నుంచి పట్టణం దాకా ఇదే పరిస్థితి



ఆమదాలవలస పారిశ్రామికవాడలో రహదారిపై నిల్వ ఉన్న వర్షపునీరు

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్: కొద్దిపాటి వర్షమొచ్చినా రహదారులు ముంపునకు గురవుతున్నాయి. రోజుల తరబడి నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఆమదాలవలస నియోజకవర్గంలో అన్నిచోట్లా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. పట్టణంలో ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని స్టేజీలపై ప్రసంగాలు గుప్పిస్తున్న కూటమి నాయకుల మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన కుదరడం లేదు. ఆమదాలవలస పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ మురుగు నీరు, వరద నీరు నిలిచిపోతోంది. సీసీ రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. వెంగళరావు కాలనీ, ఐ.జె.నాయుడుకాలనీ, కాలేజీ ఎదురు వీధి, చంద్రయ్యపేట, మెట్టక్కివలస, పూజారిపేట, పారిశ్రామికవాడలో కొన్ని వీధుల్లో సీసీ రహదారులు నిర్మించి కాలువలు నిర్మాణం చేపట్టకపోవడంతో చినుకుపడితే ఆయా ప్రాంతాలు చిత్తడిగా మారుతున్నాయి. కలివరం గ్రామ మార్కెట్‌కు వెళ్లే రహదారి ఎప్పుడు వర్షం పడినా చెరువును తలపిస్తుంటుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ ఉపాధి హామీ పథకం కింద రహదారులు నిర్మాణానికి మంజూరైన నిధులతో కొందరు పాలకులు ఇళ్లముందు రహదారులు నిర్మించుకుంటున్నారే తప్ప నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే రోడ్లను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కలివరంలో చెరువును తలపిస్తున్న సీసీ రోడ్డు

నిత్యం నరకమే..



బీఆర్ నగర్ ప్రాంతంలో సుమారు 200 కుటుంబాలు నివాసముంటున్నాయి. రైల్వే ట్రాక్ ఇవతల వైపు ఉండటంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ అధికారులు గాని, పాలకులు గాని ముందడుగు వేయడంలేదు. రోడ్లు లేక వర్షం పడితే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొందరు తమ వాహనాలను దూరప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– జి.కృష్ణమూర్తి, విశ్రాంత ఉపాధ్యాయుడు, బి.ఆర్.నగర్, ఆమదాలవలస మున్సిపాలిటీ